పత్రికాప్రకటన కాకినాడ, మార్చి 7 , 2019.

## యం.ఎల్.,సి. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి.

## నూతనంగా 3,014 ఓటర్ల నమోదు.

– జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా.

ఈ నెల 22వ తేదీన జరుగనున్న పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేస్తున్నట్లు జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. గురువారంనాడు కలక్టరేట్‌లోని మీడియా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో పట్టభద్రుల నియోజకవర్గానికి 51 నామినేషన్లు వేసారని, వీరిలో ఇద్దరు నామినేషన్లు తిరస్కరించడం జరిగిందన్నారు. నామినేషన్ ఉపసంహరణకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు సమయముందని ఆ తరువాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలతో బ్యాలెట్ పేపరు రూపొందించడం జరుగుతుందన్నారు. ఓటర్ల తుది జాబితా ప్రచురించే నాటికి 2,90,780 ఓటర్లు నమోదు అయ్యారని, తదుపరి ఫారమ్-18 ద్వారా 3014ఓటర్లు నమోదు అయ్యారన్నారు. వీరితో కలిపి మొత్తం 2,93,794 ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారన్నారు. అదే విధంగా గతంలో ప్రతిపాదించిన 299 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 33 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించడం ద్వారా మొత్తం 332 పోలింగ్ కేంద్రాలు పని చేస్తాయన్నారు. పోలింగ్ నిర్వహణకు 47 సెక్టార్లు, 50 రూట్లుగా విభజించడం జరిగిందన్నారు. పోలింగ్ నిర్వహణకు బ్యాలెట్ పేపర్లు కలక్టరేట్ ప్రజావాణి హాల్‌లో పరిశీలించి ట్రెజరీలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామన్నారు. 21వ తేదీన ఉదయం 7-00 గంటల నుండి ఆయా డివిజన్ కేంద్రాల నుండి బ్యాలెట్ పేపర్లను సిబ్బందిని సంబంధిత పోలింగ్ స్టేషన్లకు పంపిస్తామని కలక్ట ర్ తెలిపారు. పోలింగ్ 22వ తేదీ ఉదయం 8 గంటల నుండి 4 గంటల వరకు జరుగుతుందని తదుపరి బ్యాలెట్ బాక్సులను రంగరాయ వైద్య కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తామన్నారు. 26వ తేదీన రంగరాయ వైద్య కళాశాలలో కౌంటింగ్ జరుగుతుందని దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ మరియు కౌంటింగ్ కోసం సిబ్బంది ఈ నెల 12వ తేదీ నుండి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని, మైక్రో అబ్జర్వర్లకు 8వ తేదీ శుక్రవారం రంగరాయ వైద్య కళాశాలలో ఎన్నికల పరిశీలకుల సమక్షంలో శిక్షణ నిర్వహిస్తామన్నారు.

### సాధారణ ఎన్నికల నిర్వహణకు సన్నాహక ఏర్పాట్లుః

జిల్లాలో ఇప్పటి వరకూ 2,611 పోలింగ్ కేంద్రాలలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమాల ద్వారా 3,29,529 మంది ఓటర్లుకు వివిపాట్ యంత్రాలు, ఈవియంల పై అవగాహన కల్పించామని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. రానున్న సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఓటర్లు వివిపాట్ యంత్రాలను తొలిసారి వినియోగించనున్న నేపధ్యంలో ఈ యంత్రాలపై ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో పెద్ద ఎత్తున చేపట్టామని ఆయన తెలియజేశారు. జిల్లాలోని సుమారు 40 లక్షల మంది ఓటర్లలో కనీసం 10 నుండి 15 శాతం ఓటర్లు లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టి, బృహత్తర స్థాయిలో 4 లక్షలకు పైబడి ఓటర్లకు ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించే అంశంలో దేశంలోనే తూర్పు గోదావరి జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. ఇందుకు జిల్లాలో 410 ఓటింగ్ యంత్రాలను వినియోగిస్తున్నామన్నారు. అవగహనా కార్యక్రమాల అనంతరం ఈ యంత్రాలకు కూడా ఫస్ లెవెస్ చెకింగ్ పూర్తి చేసి రిజర్వు యంత్రాలుగా వాడతామని తెలియజేశారు. ఓటింగ్ యంత్రాలకు జిల్లా స్థాయిలో ఫస్ట్ లెవెల్ రాండమైజేషన్ పూర్తి చేసిన అనంతరం తరలించి భద్రపరిచేందుకు అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా స్ట్రాంగ్ రూమ్‌లు గుర్తించాలని రిటర్నింగ్ అధికారులు, ఆర్‌డిఓలను ఆదేశించామన్నారు. ఎన్నికల పోలింగ్‌కు ముందు అసెంబ్లీ నియోజక వర్గ స్థాయిలో రెండవ విడత రాండమైజేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

సాధారణ ఎన్నికల సందర్భంగా పెయిడ్ న్యూస్ అంశాలను గుర్తించేందుకు ప్రత్యేక యాప్ సిద్ధం చేస్తున్నామని, ఇటువంటి వార్తలపై ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారులకు, సంబంధిత అభ్యర్థులకు సమాచారం అందించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఈ యాప్ ద్వారా వీలౌతుందన్నారు. అలాగే సి-విజిల్, సువిధ, సమాధాన్ వంటి ఎన్నికల కమీషన్ ఓటర్లు, అభ్యర్థులకు సౌలభ్యం, సమాచారం కొరకు అందుబాటులోకి తెచ్చిన యాప్‌లతో, కలెక్టరేట్ ప్రజావాణి హాలులోపల, బయట డాష్‌బోర్డులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

ఈ విలేఖర్ల సమావేశంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ సమిత్ కుమార్ గాంధీ, రంపచోడవరం ఐటిడిఏ పిఓ నిషాంత్ కుమార్, డిఆర్ఓ యం.వి.గోవిందరాజులు, సమాచార శాఖ ఉపసంచాలకులు యం.ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

(ఎన్నికల మీడియా సమాచార కేంద్రంచే జారీ)